లక్షాధికారులను చేయడమే లక్ష్యం




డ్వాక్రా మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని, సభకు హాజరైన మహిళలు

● ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: మహిళలను లక్షాధికారులను చేయడమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మహిళల ఆర్థిక సాధికారత సహా వారి అభ్యున్నతి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌ను అక్కచెల్లెమ్మలు నిండుమనస్సుతో ఆశీర్వదించాలని ఆయన కోరారు. మంగళవారం స్థానిక ఎస్‌జేపీ ప్రభుత్వ పాఠశాల క్రీడామైదానంలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద పట్టణంలో 1335 స్వయం సహాయక సంఘాల్లోని 13,022 మంది మహిళలకు మంజూరైన రూ.9.37 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవానీతో కలిసి అందజేశారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. థ్యాంక్యూ సీఎం సార్ నినాదాలతో మైదానం హోరెత్తింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్వాక్రా అక్కచెల్లెమ్మల ఆర్థిక ప్రగతికి వైఎస్సార్ శ్రీకారం చుట్టారన్నారు. తండ్రి బాటలోనే ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ కూడా వైఎస్సార్ ఆసరా ద్వారా దేశంలోనే అతిపెద్ద మహిళా సాధికార పథకాన్ని మూడేళ్లుగా అమలు చేస్తూ అక్కచెల్లెమ్మలకు అండగా నిలిచారని చెప్పారు. ఆసరా సొమ్ము ద్వారా మహిళలు జీవనోపాధి, స్వయం ఉపాధిని పెంపొందించుకుని ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను మహిళల పేరిట మంజూరు చేస్తున్న జగనన్నకు చల్లని దీవెనలందించాలని ఎమ్మెల్యే కోరారు. కమిషనర్ బండి శేషన్న, మెప్మా టీపీఆర్ఓ మోహన్, సీఎంఎం.భవాని, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్.రామలింగప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు సుంకప్ప, కౌన్సిలర్లు ప్రభాకర్, చాంద్‌బాషా, మెహరున్నీసా, కెవి.నాగరత్న, విద్యారాణి, చెన్నమ్మ, రంగమ్మ, చాముండేశ్వరి, నీలావతి, అర్షియా,రవీంద్ర, సుమోబాషా, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యుగంధర్‌రెడ్డి, కోఆప్షన్‌సభ్యులు ఫ్లయింగ్ మాబు, నూర్‌నిజామి, సీఓలు సుశీల, వనజ, మనోప్రియ, అంజనా, మధు, రామాంజి, టీఎల్ఎఫ్ లీడర్లు, ఆర్‌పీలు, సుమారు 7 వేల మంది డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కుట్రలు, మోసాలకు కేరాఫ్ చంద్రబాబు

డ్వాక్రా అక్కచెల్లెమ్మలు, అన్నదాతల రుణాలను మాఫీ చేస్తానని 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు అందర్నీ నిలువునా మోసం చేశాడని ఎమ్మెల్యే వైవీఆర్ మండిపడ్డారు. కుట్రలు, మోసాలకు కేరాఫ్‌గా నిలిచిన చంద్రబాబును ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మవద్దని ఆయన సూచించారు. పార్టీ గుర్తులతో సంబంధం లేకుండా మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు చోట్ల గెలుపొందామని రెచ్చిపోతున్న చంద్రబాబు వాపును చూసి బలుపు అనుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నకే జనం జేజేలు పలకడం ఖాయమన్నారు.

అక్కచెల్లెమ్మలకు జగనన్న అండ




మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, సమావేశానికి హాజరైన మహిళలు

● ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: అక్కచెల్లెమ్మల సీఎం జగనన్న అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆయన వైఎస్సార్ ఆసరా–కింద మహిళాసంఘాల సభ్యులకు ప్రభుత్వం మూడో విడతగా 474 సంఘాలకు 4,721 మంది సభ్యులకు మంజూరు చేసిన 3.29 కోట్ల మెగా చెక్కును అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 98 శాతానికి పైగా అమలు చేశారన్నారు. డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా కింద రుణాలన్నీ మాఫీ చేశారన్నారు. మహిళా సంక్షేమానికి జగనన్న పెద్దపీట వేశారన్నారు. వైఎస్సార్ ఆసరా నిధులతో ఏం చేశారని ఎమ్మెల్యే ప్రశ్నించగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నామని మహిళలు చెప్పారు. ఏ గ్రామానికి వెళ్లినా తమ ప్రభుత్వానికి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. నియోజకవర్గంలో 30 ఏళ్ల పాటు అధికారం అనుభవించిన వారు గ్రామాల్లో వర్గకక్షలు రేపి ప్రజలను తమ చుట్టూ తిరిగేలా చేశారన్నారు. ప్రజల్లోకి వెళితే తమను అభివృద్ధిపై ప్రశ్నిస్తారేమోనని సదరు నాయకులు తిరగకుండా గ్రామస్థాయి నాయకులను పంపుతున్నారన్నారు. మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈసందర్భంగా మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం వరదాయపల్లి, తిమ్మనచెరువు, పెద్దపప్పూరుకు చెందిన ముగ్గురికి రూ.3.35 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వైకేపీ ఏసీ రాజ్యలక్ష్మి, ఏపీఎం రవిచంద్రరాజు, ఎంపీడీఓ రామకృష్ణ, జాతీయ ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథ రెడ్డి, ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైస్ ఎంపీపీలు పప్పుక కళావతి, రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీజిల్లా పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, ఎంపీటీసీ మేకల సరోజ, సర్పంచు ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' చెక్కు పంపిణీ

తాడిపత్రి: పుట్లూరు రోడ్డులోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి బుధవారం పట్టణ, రూరల్ పరిధిలోని పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసారా మూడో విడత మెగా చెక్కు పంపిణీ చేయనున్నారు. ఈమేరకు మంగళవారం ఎంపీడీఓ రంగారావు ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

డీజీపీని కలిసిన ఆలూరు



డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో కలిసి జ్ఞాపికను అందజేశారు. అనంతరం నియోజకవర్గంలో సర్కిల్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్, సిబ్బందికి నూతన భవనాల మంజూరు చేయాలని డీజీపీని కోరారు.

పాఠశాలకు విరాళం



చెక్కు అందిస్తున్న శ్రీనివాసులు

యాడికి: యాడికి జెడ్పీ ఉన్నత పాఠశాలకు రాయల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.25 వేలు అందించారు. మంగళవారం పాఠశాలలో రూ.25 వేల చెక్కును రాయలచెరువు గ్రామానికి చెందిన ట్రస్టు చైర్మన్ శ్రీనివాసులు హెచ్ఎం విజయమ్మకు అందజేశారు. డబ్బును జీవశాస్త్ర ప్రయోగశాల అభివృద్ధికి వినియోగిస్తామని హెచ్ఎం తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

గుంతకల్లుటౌన్: పట్టణ నడిబొడ్డునున్న అతిపురాతన కోదండరామస్వామి ఆలయంలో గురువారం నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మతం మల్లికార్జున మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం శ్రీరామనవమి, 6వ తేదీ ఉదయం సీతారాముల కల్యాణం, 7వ తేదీ ఉదయం శ్రీరామ పట్టాభిషేకం, సాయంత్రం స్వామి వార్ల ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించనున్నట్లు ఈఓ తెలియజేశారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

దాహార్తి తీర్చడం పుణ్యకార్యం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ వెంకటరామిరెడ్డి

గుత్తి: వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చడం పుణ్యకార్యమని సీఐ వెంకటరామిరెడ్డి అన్నారు. పట్టణంలోని రాయల్ సర్కిల్ వద్ద మంగళవారం గూడ్స్ వెహికల్ అసోసియేషన్ అధ్యక్షుడు వరిగడ్డి షాషావలి బ్రదర్స్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్, మజ్జిగ చలి వేంద్రం ఏర్పాటు సీఐ ప్రారంభించారు. వరిగడ్డి షాషావలి సోదరులు 15 ఏళ్లుగా చలి వేంద్రం ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. వరిగడ్డి షాషావలి, దస్తగిరి, మాబు, షేక్షావలి, సాదిక్ వలి, రాజేష్, నూర్‌బాషా, ఖాజా, చిన్నోడు, దుర్గా పాల్గొన్నారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: శోభకృత నామ సంవత్సర త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత సభ్యులు ఆచార్య ప్రబోధానంద రచించిన భగవద్గీత శ్లోకాల పుస్తకాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి సభ్యులు సూర్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఓబులేసు, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి: స్థానిక షాదీఖానాలో మంగళవారం పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆయూష్ జిల్లా సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో బెంగళూరు శంకర ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు స్వప్న 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 85 మందిని కంటి శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ టీ మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి పీసీ జయరామ్, కవి నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా ప్రకటించాలి



మాట్లాడుతున్న మాజీ సైనిక ఉద్యోగులు

గుత్తి: ఎంతో చారిత్రాత్మకమైన గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా ప్రకటించాలని మాజీ సైనిక ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గుత్తి కోటను మంగళవారం మాజీ సైనిక ఉద్యోగులు సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జింకా రామమూర్తి గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చౌదరి విజయభాస్కర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే ఎంతో ఘన చరిత్ర కలిగిన గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా ప్రకటించాలన్నారు.కోటలో శిథిలావస్థకు చేరిన కట్టడాలను పునర్నిర్మించాలన్నారు. మాజీ సైనిక ఉద్యోగుల సంఘం నాయకులు కృష్ణయ్య, లక్ష్మీపతి, కృష్ణారావు, దస్తగిరి, కోట సంరక్షణ సమితి మైనార్టీ విభాగం అధ్యక్షుడు హెచ్ఎం అర్షద్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనిద్దాం



మరుగుదొడ్లు మరమ్మతు చేసిన దృశ్యం

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు చేయూతనిద్దామని ఏపీ గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో అన్నమయ్య జిల్లా చిన్న మండెంకు చెందిన ఎంఎస్ఎల్ సొసైటీ వారు మరుగుదొడ్లు మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎంఎస్ఎల్ సొసైటీ ఎస్టీ గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లు మరమ్మతు చేయించడం అభినందనీయమన్నారు. పేద విద్యార్థులకు చేయూతనిస్తే వారు మరింతగా రాణిస్తారన్నారు. సొసైటీ వైస్ చైర్మన్ రమేష్, వార్డెన్ బయపరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్‌చౌదరి, ఉపాధ్యాయులు పీరూనాయక్, షహీనా బేగం, ఆనంద్, నరసింహులు, లీలావతి, చంద్ర, గోపాల్, రాజేష్, ఎలిజిబెత్ రాణి పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ వేడుకలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద వెలసిన హజరత్ సయ్యద్ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రీ సాహెబ్ దర్గాలో ఇఫ్తార్ వేడుకలు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతనతో మెలగాలన్నారు. తోటి వారికి సహాయ పడే గుణం అలవర్చు కోవాలన్నారు. అనంతరం ఇఫ్తార్ వేడుకలు నిర్వహించారు. మత పెద్దలు హజరత్ సయ్యద్ అహ్మద్ పీర్ ఖాద్రీ సాహెబ్, ప్రభుత్వ ఖాజీ హఫీజ్ హుసేన్ షా ఖాద్రీ, పాన్ పరాక్ మహబూబ్‌బాషా, నబీరసూల్, జుబేర్, ఉమేర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న 8 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సతీష్ తెలిపారు. మంగళవారం ఆయన విద్యార్థులు బాలచేతన్, సాయిఅఖిలరెడ్డి, వెంకటప్రణవి, సౌమ్య, నీహారిక, శీను, గాయత్రి, మౌనికబాయిని అభినందించారు.

ఎస్ఆర్ఐటీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలోని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ డిపార్ట్‌మెంట్ ద్వితీయ, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఏఎంపీ 2కే–23లో అత్యంత ప్రతిభ కనబరినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. ఈ నెల 27న శ్రీ కృష్ణ దేవారాయ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఏఎంపీ 2కే 23లో పేపర్ ప్రెజెంటేషన్‌లో జ్యోతిశ్రీ, కళ్యాణి, కుసుమ, మొదటి బహుమతి, టెక్ ఎక్స్‌పోలో సుభాని సుహైల్, శశాంక్ మొదటి బహుమతి, టెక్ క్విజ్‌లో గౌతమి, సుధీర్, సోనియా మూడో బహుమతి, మరికొందరు కన్సోలేషన్ బహుమతులు సాధించారన్నారు. మంగళవారం వీరిని కళాశాలలో కళాశాల యాజమాన్యం అభినందించింది.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించండి

గార్లదిన్నె: ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని తహసీల్దార్ ఉషారాణి లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం గార్లదిన్నె జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులతో హౌసింగ్ అధికారులు సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కొంత మంది ఇళ్లు మంజూరైనా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదన్నారు. ప్రభుత్వం కాలనీల్లో అన్ని వసతులు కల్పించిందన్నారు. సకాలంలో బిల్లులు చెల్లిస్తోందని, వెంటనే ఇళ్ల పనులు ప్రారంభించి పూర్తి చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ విజయభాస్కర్ , హౌసింగ్ ఏఈ విజయభాస్కర్ రావు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సేవకుల సదస్సు



దైవ సందేశం వినిపిస్తున్న బందెల రాజు

గుత్తి: పట్టణంలోని కోళ్ల ఫారం బైబిల్ మిషన్ చర్చిలో మంగళవారం చర్చి పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రైస్తవ సేవకుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సౌత్ ఇండియా పాస్టర్స్ క్రిష్టియన్ జేఏసీ సౌత్ ఇండియా డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ బందెల రాజు దైవ సందేశమిచ్చారు. అనంతరం సేవకులకు దుస్తులు పంపిణీ చేశారు. బైబిల్ మిషన్ చర్చి పాస్టర్ సుధాకర్, చర్చి పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాథ్యూ అనిల్ బాబు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ డి.చంద్రశేఖర్, కోశాధికారి శేఖర్, పాస్టర్లు గాబ్రియేల్ ప్రసాద్, ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, పట్టణ కన్వీనర్ పీరా, మండల కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి, రామరంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆసరా మెగా చెక్కు పంపిణీ

శింగనమల: నియోజకవర్గ కేంద్రంలోని రామాలయ ఆవరణలో బుధవారం వైఎస్సార్ ఆసారా మూడోవిడత మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైకేపీ ఏపీఎం నారాయణ స్వామి తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఎంపీపీ యోగేశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు కంచిరెడ్డి సుధ, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి హాజరవుతారన్నారు. డ్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వచ్చే నెల 1న అక్కచెల్లెమ్మలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు వైఎసాసర్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

గుంతకల్లు: పట్టణంలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మున్సిపల్ హైస్కూల్‌లోని విద్యార్థులకు పూర్వ విద్యార్థులు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. పాఠశాలకు చెందిన 2012–13 బ్యాచ్ విద్యార్థులు కార్యక్రమం చేపట్టారు. పాఠశాల హెచ్ఎం రవికుమార్, పూర్వవిద్యార్థులు మల్లేష్, ఇసాక్, భీమచంద్ర, ఉపాధ్యాయులు శంకరయ్య, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలూరులో కార్డెన్ సెర్చ్



మహిళలతో మాట్లాడుతున్న రూరల్ ఎస్ఐ గౌస్ మహమ్మద్

తాడిపత్రి: ఆలూరు గ్రామంలో రూరల్ సీఐ చిన్నపెద్దయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఎస్ఐ గౌస్ మహమ్మద్ పోలీసులతో కలసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ట్రబుల్ మాంగర్లు, రౌడీ షీటర్లు, ఫ్యాక్షనిస్టుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.రూరల్ ఎస్ఐ గౌస్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

యథాతథంగా ఇంధన సరఫరా

గుత్తి: పట్టణ శివారులోని ఉన్న బీపీసీఎల్ డిపో నుంచి ఇంధన సరఫరా, నిల్వ కొనసాగుతుందని బీపీసీఎల్ టెరిటోరియల్ మేనేజర్ మనోజ్ కన్నారిల్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గుత్తి బీపీసీఎల్ డిపో నుంచి అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు ఇక మీదట కూడా ఇంధన సరఫరా యథాతథంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. కొందరు ఇంధన సరఫరా కొనసాగదని అపోహలు సృష్టిస్తున్నారని, అలాంటి దేమీ లేదని తెలియజేశారు. ఈ విషయాన్ని అందరూ గమనించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

గుంతకల్లు రూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎస్ఎస్ఎస్ పీఓ బసెట్టి కృష్ణయ్య పేర్కొన్నారు. శ్రీశంకరానందగిరీ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బృందం కసాపురంలో మంగళవారం నాల్గవ రోజు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నాలుగు గ్రామాల్లో ఆధార్ మొబైల్ కేంద్రాలు

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్ల, కోమటికుంట్ల, అరకటివేముల, కందికాపుల గ్రామాల్లో మంగళవారం ఆధార్ మొబైల్ కేంద్రాల ద్వారా ప్రజలకు ఆధార్ సేవలను అందించినట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. ప్రజలు మొబైల్ ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళకు గాయాలు

గుత్తి రూరల్: లచ్చానుపల్లి గ్రామంలో మంగళవారం ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాలిలు.. గ్రామానికి చెందిన మార్తమ్మ సమీప బంధువు ఇంటికి వెళ్తూ కాలుజారి కింది పడింది. ప్రమాదంలో తల, చేతులకు బలమైన గాయాలయ్యాయి. అమెను కుటుంబసభ్యులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రాయి పడిందా...ప్రాణాలు గోవిందా!



అధికలోడుతో వెళుతున్న ట్రాక్టరు

యల్లనూరు: తాడిపత్రి నుంచి యల్లనూరు వైపు రోజులు పదుల సంఖ్యలో ట్రాక్టరులో పునాదికి వాడుకునే గోడరాళ్లు, నల్లబండల ముక్కలను వేసుకుని వెళుతుంటారు. దీంతో వాహనదారుల మీద ఎక్కడ పడుతాయోనని ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు అధికారులు చెప్పినప్పటికీ ట్రాక్టరు యజమానుల తీరు మారడం లేదు. ట్రాక్టరు ట్రాలీ పైకి రాళ్లు ఒకదానిపై ఒకటి పెట్టి వాహనం నడుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన వసంత నవరాత్రి ఉత్సవాలు



గీతాలాపాన చేస్తున్న భక్తులు

పామిడి: ఎద్దులపల్లిలోని ఉమామహేశ్వర, సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఉగాదిని పురస్కరించుకుని భజంత్రి సత్యనారాయణ సౌజన్యంతో వారంరోజులుగా నిర్వహించిన వసంత నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ముగిసాయి. మంగళవారం శ్రీకృష్ణుని విగ్రహాన్ని శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భజన బృందం భక్తి గీతాలాపనల నడుమ భక్తులు పరవశించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం గ్రామవీధుల్లో శ్రీకృష్ణుని చిత్రపటాన్ని భక్తిగీతాలాపనల నడుమ ఊరేగించారు.

అడిగిన వారందరికీ ఉపాధి పనులు



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీఓ విజయభాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం కనంపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు నాణ్యతతో చేయాలన్నారు. జాబ్ కార్డులో పేరున్న వారు మాత్రమే పనులకు వెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరూ గిట్టు బాటు కూలీ వచ్చేవరకు పనులు చేయాలన్నారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా సీతారాముల బ్రహ్మోత్సవాలు



పూజలందుకున్న సీతారాములు

బుక్కరాయసముద్రం: మండలంలోని కొట్టాలపల్లిలో సీతారాముల బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం నుంచి ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారు గరుడ వాహనంపై దర్శనమిచారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 10.20 నుంచి 11 గంటల వరకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు రథోత్సవం ఉంటుందన్నారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాత్రి 7 గంటలకు ఆలయంలో రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం పారువేటోత్సవం, సాయంత్రం సీతారాములను హంస వాహనంపై ఊరేగిస్తామని వివరించారు.

నేడు సుంకం వసూలు వేలం

యాడికి: మండల కేంద్రంలో బస్టాండు, దినసరి మార్కెట్, జంతు వధశాలకు సంబంధించి సుంకలం వసూలు హక్కు కోసం బుధవారం వేలం పాట నిర్వహిస్తున్నామని యాడికి పంచాయతీ ఈఓ ఎర్రిస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు వేలం జరుగుతుందని, డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.